క్లుప్తంగా

విద్యార్థులకు అభినందన



విద్యార్థులను అభినందిస్తున్న కలెక్టర్

కరీంనగర్‌కల్చరల్: బాలసదనం, చైల్డ్‌కేర్ ఇనిస్టిట్యూషన్‌లో చదువుతూ, మిషన్ వాత్సల్య ద్వారా ఉపకార వేతనం పొంది పదో తరగతి, ఇంటర్‌లో మంచి ఫలితాలు సాధించిన 13 మంది విద్యార్థులను కలెక్టర్ పమేలా సత్పతి శనివారం అభినందించారు. తల్లిదండ్రులు లేని విద్యార్థులు బాలసదనంలో ఉంటూ మంచి ఫలితాలు సాధించారని, భవిష్యత్‌లో మరిన్ని విజయాలు సాధించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ అజయ్‌యాదవ్, జిల్లా సంక్షేమ అధికారి ఎం.సరస్వతి, అడిషనల్ డీఆర్‌డీవో సంధ్యారాణి, డీసీపీవో శాంత, సిబ్బంది తిరుపతి, రమేశ్, స్వప్న, కవిత తదితరులు పాల్గొన్నారు.

బిషప్‌కు మంత్రి శుభాకాంక్షలు



శుభాకాంక్షలు తెలుపుతున్న మంత్రి పొన్నం

కరీంనగర్‌కల్చరల్: కరీంనగర్ దక్షిణ మండలి అధ్యక్షుడిగా 9 ఏళ్లు పూర్తి చేసుకున్న బిషప్ రూబెన్‌మార్క్‌ను శనివారం మంత్రి పొన్నం ప్రభాకర్ కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మంత్రిని చర్చి ప్రతినిధులు సన్మానించారు.

బిషప్ దంపతులకు సన్మానం

కరీంనగర్ బిషప్ డాక్టర్ రూబెన్‌మార్క్ పదవీ బాధ్యతలు స్వీకరించి 9 ఏళ్లు పూర్తయిన సందర్భంగా శనివారం సీఎస్ఐ వెస్లీ చర్చిలో బిషప్ కార్యాలయ మాజీ ఉద్యోగి, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు బొబ్బలి విక్టర్ సత్కరించి అభినందించారు. కార్యక్రమంలో ఎస్.బాబు, అమిత్ కుమార్, ఎం.రాంరెడ్డి, కె.రాజకుమార్, ఆర్.తిరుపతి, ఎస్.శివప్రసాద్, ప్లాస్టర్లు తదితరులు తదితరులు పాల్గొన్నారు.

కమలం గూటికి స్వర్ణకార సంఘం నేతలు



ఎంపీ సంజయ్‌తో స్వర్ణకార సంఘం నేతలు

కరీంనగర్‌టౌన్: కరీంనగర్ నగర స్వర్ణకారుల సంఘం నేతలు శనివారం బీజేపీ ఎంపీ అభ్యర్థి బండి సంజయ్ కుమార్ సమక్షంలో కమలం గూటికి చేరారు. కరీంనగర్ నగర స్వర్ణకార సంఘం అధ్యక్షుడు రావుల శ్రీకాంత్, ప్రధాన కార్యదర్శి కందుకూరి శ్రీనివాస్, ఉపాధ్యక్షులు కడర్ల చంద్రశేఖర్, వెగ్గళం రామకృష్ణ, ముతోజు ప్రకాష్, శ్రీరామోజు కిరణ్, శ్రీరామోజు రవీంద్రచారి, ముల్కల సతీశ్, కళికోట గణేశ్, రాజశేఖర్, విశ్వం, మియ్యపురం కిరణ్, క్రాంతి, శ్రావణ్, సంతోష్, వెంకటేశ్, తదితర నాయకులు కాషాయ తీర్థం పుచ్చుకున్నారు. వీరందరికీ బండి సంజయ్‌కుమార్ పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో 46వ డివిజన్ బీజేపీ ఇన్‌చార్జి కళికోట మోహన్, బీజేవైఎం నాయకులు కనపర్తి రామ్‌నారాయణ తదితరులు పాల్గొన్నారు.

బీసీ సదస్సును విజయవంతం చేయాలి

కరీంనగర్‌కల్చరల్: హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఈనెల 7న జరిగే బీసీల రాష్ట్రస్థాయి సదస్సును విజయవంతం చేయాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేశిపెద్ది శ్రీధర్‌రాజు కోరారు. బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య ఆధ్వర్యంలో జరిగే సదస్సులో చట్టసభల్లో బీసీలకు 50శాతం రిజర్వేషన్ కల్పించాలని, జాతీయస్థాయిలో బీసీ కుల గణన జరగాలని, బీసీ ఉద్యోగులకు ప్రమోషన్లు, రిజర్వేషన్లు కల్పించాలని, బీసీలకు ప్రత్యేక మంత్రిత్వశాఖ ఏర్పాటు చేయాలని, అలాగే రిజర్వేషన్లపై స్పష్టమైన వైఖరి తెలియజేయాలని తదితర అంశాలపై చర్చ జరుగుతుందన్నారు.

భూమయ్య మృతికి సంతాపం



విద్యానగర్: వెల్గటూర్ మండల విద్యాధికారి బత్తుల భూమయ్య విధినిర్వహణలో వడదెబ్బ తగిలి మృతి చెందడంపై తెలంగాణ ఎస్సీ ఎస్టీ ఉపాధ్యాయ సంఘం సంతాపం ప్రకటించింది. శనివారం చొప్పదండిలోని ఆయన స్వగృహంలో భూమయ్య పార్థివ దేహాన్ని దర్శించి పూలమాలు వేసి నివాళ్ళర్పించారు. ఆయన కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా భూమయ్య విద్యారంగానికి అందించిన సేవలను కొనియాడారు. నివాళి అర్పించిన వారిలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ నాయక్, జిల్లా అధ్యక్షుడు మీసాల మల్లిక్, నాయకులు గిరి సురేష్, కోదారి రవీందర్ తదితరులున్నారు.

సండే స్పెషల్

వేసవి పూట.. జలకాలాట

- నగరంలో స్విమ్మింగ్‌కు పెరిగిన ఆసక్తి
- స్విమ్మింగ్ పూల్స్‌లో చిన్నారుల సందడి
- వేసవి ఉపశమనానికి ఈత బాట

కరీంనగర్ అంబేడ్కర్ స్టేడియంలోని స్విమ్మింగ్ పూల్‌లో సందడి



కరీంనగర్‌స్పోర్ట్స్: ఓ పక్క భానుడి భగభగ మండుతుంటే దాని నుంచి ఏ విధంగా తప్పించుకోవాలని చూస్తుంటారు చాలా మంది. దానికి ఉపశమనం ఒక్క స్విమ్మింగ్‌తోనే సాధ్యమనుకుంటారు. దీంతో ఆఫీసుల్లో పని ముగించుకొని తల్లిదండ్రులు తమ పిల్లలను వెంటేసుకొని స్విమ్మింగ్‌పూల్‌ల బాట పడుతున్నారు. దీనికి తోడు పాఠశాలలకు వేసవి సెలవులు ఇవ్వడంతో చాలా మంది తల్లిదండ్రులు తమ పిల్లలకు స్విమ్మింగ్ నేర్పించడానికి ఆసక్తి కనబరుస్తున్నారు. పలువురు దేహదారుఢ్యం కోసం, వేసవి ఉపశమనం కోసం స్విమ్మింగ్ చేస్తుండడటంతో నగరంలోని స్విమ్మింగ్‌పూల్స్ కళకళలాడుతున్నాయి. స్విమ్మింగ్‌కు వచ్చే పలువురిని 'సాక్షి' పలకరించగా వారి మనోభిప్రాయాలను ఇలా వ్యక్తం చేశారు.

సందడిగా స్విమ్మింగ్ పూల్



టెక్నిక్ నేర్పిస్తున్న కోచ్‌లు

సమ్మర్ హాలీ డేస్ ప్రారంభం నుంచే నగరంలోని పలు స్విమ్మింగ్ పూల్‌లలో సందడి మొదలైంది. కరీంనగర్ లోని అంబేడ్కర్ స్టేడియంలో గల స్విమ్మింగ్ పూల్ చిన్నారులతో కిక్కిరిసిపోతుంది. ప్రతీ సంవత్సరం నిర్వహించే వేసవి క్రీడా శిబిరాలు లేకపోయేసరికి పెద్ద సంఖ్యలో స్విమ్మింగ్ చేసేందుకు వస్తున్నారు. ఉదయం, సాయంత్రం వేళలో స్టేడియంలోని స్విమ్మింగ్ పూల్ జాతరను తలపించేలా కనిపిస్తుండడం విశేషం.

స్విమ్మింగ్‌తో లాభాలు

స్విమ్మింగ్‌తో చాలా లాభాలున్నాయి. ఎండ నుంచి ఉపశమనమే కాకుండా శారీరక, మానసిక ఉల్లాసం కలుగుతుందని నిపుణులు పేర్కొంటున్నారు. ఆరోగ్యం బాగుండటమే కాకుండా ఊపిరితిత్తుల కెపాసిటీ పెరుగుతుంది. గుండె దృఢంగా ఉంటుంది. బీపీ, షుగర్ కంట్రోల్‌లో ఉంటుంది. రక్త ప్రసరణ మెరుగవుతుంది. ముఖ్యంగా చిన్న పిల్లల పెరుగుదలకు దోహదపడుతుంది.



జాగ్రత్తలివే..

- కొత్తగా ఈత నేర్చుకునేవారు లోతైన ప్రదేశాలకు వెళ్లొద్దు.
- ట్యూబ్, బుర్రకాయ, వాటర్ ప్లాస్టిక్ క్యాప్స్ తదితర వస్తువులతో పెద్దవారి పర్యవేక్షణలో నేర్చుకోవాలి.
- పిల్లలకు ఈత నేర్పే పర్యవేక్షకుడికి ఈత పూర్తిగా వచ్చి, ప్రమాదం నుంచి కాపాడే శక్తి ఉండాలి.
- ప్రత్యేక శిక్షణ పొందిన స్విమ్మర్‌ల వద్ద నేర్చుకోవాలి.
- స్విమ్మింగ్ లైఫ్ గార్డు, లైఫ్ సేవర్ కోచ్‌ల వద్ద శిక్షణ పొందితే బాగుంటుంది.
- స్విమ్మింగ్ వచ్చని తోటి స్నేహితులు చెప్పే మాటలు నమ్మి ఈత కొలనుకు వెళ్లొద్దు.
- ఈత నేర్చుకునేప్పుడు 3 ఫీట్ల లోతు నీటిలో నేర్పడం ఉత్తమం. పూర్తిగా నేర్చుకున్నాక 8 ఫీట్ల లోతులో ఈదొచ్చు.

స్విమ్మింగ్ చేసేలా...



స్విమ్మింగ్‌కు వచ్చే చిన్నారులకు మెలకువలు నేర్పించి పూల్‌లో దించుతాం. హ్యాండ్స్ ఎలా స్వింగ్ చేయాలి, లెగ్స్ ఎలా ట్యాప్ చేయాలి, ఎయిర్ ఎలా తీసుకోవాలి. బాడీ షేప్ ఎలా ఉంచుకోవాలి తదితర వాటిపై ఎక్కువగా ఎక్సర్‌సైజ్ చేపిస్తాం. చాలా మంది చిన్నారులు ఈ సంవత్సరం స్విమ్మింగ్ చేసేందుకు రావడం శుభపరిణామం.

– ఎంద్ర సంపత్, కోచ్

ప్రతీ సమ్మర్‌లో వస్తున్నాం



సమ్మర్ హాలీడేస్ రాగానే స్విమ్మింగ్ చేయాలనిపిస్తుంది. అందుకే మేము ప్రతీ సమ్మర్‌లో స్విమ్మింగ్ చేస్తాం. ఈ సంవత్సరం ఇప్పుడే స్టార్ట్ చేశాం. హీట్ చాలా ఉంది. దానికి ఉపశమనం అంటే స్విమ్మింగ్.

– శ్రీనందన్, అభినందన్

పేరెంట్స్ ఎంకరేజ్



సమ్మర్ వచ్చిందంటే స్విమ్మింగ్ చేయాలంటూ పేరెంట్ ఎంకరేజ్ చేస్తారు. నేను కూడా సమ్మర్ ఎప్పుడు వస్తుందా అని ఎదురు చూస్తా. హ్యాపీగా ఉంటుంది. లాస్ట్ ఇయర్ కంటే ఈసారి చాలా మంది నేర్చుకుంటున్నారు.

– ఆదిత్య, హరీశ్

స్విమ్మింగ్ అంటే చాలా ఇష్టం



స్విమ్మింగ్ అంటే చాలా ఇష్టం. సమ్మర్‌లో తప్ప మిగతా రోజుల్లో స్విమ్మింగ్ చేయడం కుదరదు. సమ్మర్ హాలీడేస్ రాగానే స్విమ్మింగ్ చేస్తా. రోజూ ఉదయం గంట సేపు స్విమ్మింగ్ చేస్తే ఎంతో రిలాక్స్ అనిపిస్తుంది.

– దక్షిత్

ఫస్ట్ టైమ్..చాలా బాగుంది



వేసవి సెలవుల్లో స్విమ్మింగ్ నేర్చుకోవాలని అనుకున్నా. వారం నుంచి వస్తున్నా. హ్యాపీగా ఉంది. ఫస్ట్ టైమ్ స్విమ్మింగ్‌కు రావడం. నా లాగా చాలా మంది వస్తున్నారు. స్విమ్మింగ్ చేస్తే ఎంజాయ్‌గా ఉంది. పెద్దయ్యాక మంచి స్విమ్మర్‌ను అవుతా.

– తానియా

చాలా మంది వస్తున్నారు



ఈయేడు ముందుగానే ఎండలు మండుతుండడంతో స్విమ్మింగ్ చేసేందుకు చాలా మంది వస్తున్నారు. వేసవి తాపానికి, శారీరక దృఢత్వానికి స్విమ్మింగ్ ఉపయోగపడుతుంది. సెలవుల్లో స్విమ్మింగ్ నేర్చుకోవడానికి పిల్లలు ఎక్కువ ఆసక్తి చూపుతున్నారు.

– చంద్రశేఖర్, కోచ్

త్రీ డేస్ నుంచి వస్తున్న..



సమ్మర్ హాలీడేస్ వచ్చాయి. స్విమ్మింగ్ చేయడమంటే చాలా ఇష్టం. లాస్ట్ ఇయర్ నేర్చుకుందామనుకున్నా. కానీ నేర్చుకోలేకపోయా. ఇప్పుడు త్రీడేస్ నుంచి వస్తున్నా. చాలా హ్యాపీగా ఉంది. కొంచెం నేర్చుకున్నా. ఇంకా బాగా నేర్చుకొని డీప్‌లో స్విమ్మింగ్ చేస్తా.

– ముస్వీరా

స్విమ్మర్ కావాలని..



సమ్మర్ హాలీడేస్‌లో నేను స్విమ్మింగ్‌కు వస్తున్నా. ప్రజెంట్ నాకు స్విమ్మింగ్ వచ్చింది. డీప్‌లో చేస్తున్నా. శిక్షకులు మా వెంటే ఉంటూ ఈతలో అన్ని రకాల మెలకువలు నేర్పిస్తున్నారు.ఇంకా రోజూ బాగా ప్రాక్టీస్ చేసి పెద్ద స్విమ్మర్ కావాలని అనుకుంటున్నా.

– హాన్సిక

ఫిజికల్ డెవలప్‌మెంట్‌కు దోహదం



పిల్లల్లో పెరుగుదల, మంచి శరీరాకృతి రావాలంటే స్విమ్మింగ్ చేయాలి. నేటి కాలంలో స్విమ్మింగ్‌పై చాలా మంది ఆసక్తి కబరుస్తున్నారు. స్విమ్మింగ్‌తో పిల్లలు తొందరగా పెరిగే అవకాశం ఉంటుంది. మంచి వ్యాయామానికి ఉదాహరణగా స్విమ్మింగ్ చెప్పచ్చు.

– శ్రీకాంత్‌రెడ్డి, డీవైఎస్‌వో, కరీంనగర్

శ్రీమద్రామాయణ మహాక్రతువుకు అంకురార్పణ



పారాయణం చేస్తున్న పండితులు

కరీంనగర్‌కల్చరల్: శాతవాహన యూనివర్సిటీ సమీపంలోని పీవీఆర్ ఫంక్షన్‌ హాల్‌లో శనివారం రాత్రి ఉత్సవ నిర్వహణ సమితి, యతిరాజ సేవామండలి, వికాసతరంగిణి 148 విద్యానగర్ శాఖ ఆధ్వర్యంలో నవాహ్నిక ఏకకుండాత్మక శ్రీమద్రామాయణ మహాక్రతువు వైభవంగా ప్రారంభమైంది. ఉభయ వేదాంత పండితుడు, ప్రవచకుడు తూపురాణి రంగాచార్యస్వామితో పాటు వైదిక బృందం ఆధ్వర్యంలో సాయంత్రం పారాయణం, పుణ్యాహవాచనం, అంకురార్పణ శాస్త్రోక్తంగా జరిగాయి. బల్మూరి ప్రభాకర్‌రావు, బల్మూరి కరుణాకర్‌రావు, డాక్టర్ శివకుమార్, కొండం దేవేందర్ రెడ్డి, మాదాడి కిశోర్‌కుమార్‌రావు, ప్రసూన్‌రావు, లక్ష్మీగిరిధర్‌రావు, లావణ్యాశ్రీపతిరావు, మాదాడి వంశీధర్‌రావు, నగరవాసులు పాల్గొన్నారు. కాగా ఆదివారం ఉదయం సాలగ్రామ అభిషేకం, సంకల్పం, కుంభారాధన, అగ్నిమధనం, వేద, ఇతిహాస, పురాణ, సాయంత్రం పారాయణాలు జరగనున్నాయి.

తండ్రికి మద్దతుగా కూతుళ్ల ప్రచారం



బొమ్మకల్‌లో ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న రాజేందర్‌రావు కుమార్తెలు రచన, రితిక

కరీంనగర్‌రూరల్: కరీంనగర్ లోక్‌సభ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి వెలిచాల రాజేందర్‌రావుకు మద్దతుగా శనివారం బొమ్మకల్‌లో ఆయన కూతుళ్లు రచన, రితికతో పాటు సోదరుడి కూతురు స్నేహలు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గ్రామంలో ఇంటింటికీ తిరుగుతూ కాంగ్రెస్ గ్యారంటీ పథకాలు, పాంచ్ న్యాయ్‌లకు సంబంధించిన కరపత్రాలు పంపిణీ చేశారు. అనంతరం చెరువులో పూడికతీత పనులు చేస్తున్న ఉపాధిహామీ కూలీలను కలిసి మాట్లాడారు. రాజేందర్‌రావును ఎంపీగా గెలిపిస్తే చేయబోయే అభివృద్ధి పనులను వివరించి ఓటేయాల్సిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కె.రాంరెడ్డి, నాయకులు జి.రాజిరెడ్డి, బి.ఆంజనేయులు, శ్రీధర్, ఎం.కపిల్ మాధవ, మహేశ్, వీరేశం, రాయమల్లు తదితరులు పాల్గొన్నారు.

ఓటుహక్కుపై 'ఉపాధి' కూలీలకు చైతన్యం

- పనిచేసే ప్రాంతాల్లో అవగాహన సదస్సులు



ఫకీర్‌పేటలో కూలీలకు అవగాహన కల్పిస్తున్న బీఎల్‌వో నీల తదితరులు

కరీంనగర్‌రూరల్: పార్లమెంట్ ఎన్నికల్లో ఓటింగ్ శాతాన్ని పెంచేందుకు ఎన్నికల సంఘం పలు చర్యలు చేపడుతోంది. ఓటర్లందరినీ పోలింగ్ బూత్ వైపు నడిపించేందుకు పలు రకాల చైతన్య కార్యక్రమాలు నిర్వహిస్తోంది. స్వీప్(సిస్టమెటిక్ ఎడ్యుకేషన్ అండ్ ఎలక్టోరల్ పార్టిసిపేషన్) ఆధ్వర్యంలో కరపత్రాలు, వాల్‌పోస్టర్లు, కళాబృందాలతో ప్రచారం చేస్తోంది. నిరక్షరాస్యులైన గ్రామీణ ఓటర్లను చైతన్యపర్చేందుకు విస్తృతంగా అవగాహన సదస్సులు నిర్వహిస్తోంది. కరీంనగర్ మండలంలోని 17 గ్రామపంచాయతీల పరిధిలోని ఉపాధిహామీ కూలీలకు శుక్రవారం నుంచి ఓటుహక్కు వినియోగంపై సమావేశాలు నిర్వహిస్తున్నారు. కూలీలు పనిచేసే ప్రాంతాలకు బీఎల్‌వోలు, పంచాయతీ కార్యదర్శులు, ఇతర ఉన్నతస్థాయి అధికారులు హాజరై అవగాహన కల్పిస్తున్నారు. మద్యానికి, డబ్బులకు, బహుమతులకు ఓటును అమ్ముకోకుండా స్వేచ్ఛగా వినియోగించుకోవాలని సూచిస్తున్నారు. సీవిజిల్ యాప్, 1950 టోల్‌ఫ్రీ నంబర్, బీఎల్‌వోల సెల్‌ఫోన్ నంబర్లు తదితర అంశాలను వివరిస్తున్నారు. ఇప్పటివరకు ఫకీర్‌పేట, గోపాల్‌పూర్, జూబ్లీనగర్, నగునూరు తదితర గ్రామాల్లో అవగాహన సదస్సులు నిర్వహించినట్లు ఎంపీడీవో సంజీవరావు తెలిపారు. అన్ని గ్రామాల్లోని ఉపాధికూలీలకు ఓటుహక్కుపై అవగాహన కల్పించనున్నట్లు వివరించారు.

వేద విజ్ఞానం కలిగిన భూమి భారత్



మాట్లాడుతున్న శంతన్ గుప్తా

కరీంనగర్‌కల్చరల్: ప్రపంచంలో నాగరికత కన్ను తెరవకముందే వేదవిజ్ఞానం ప్రజ్వరిల్లిన పుణ్యభూమి మన దేశమని, అటువంటి భారత్ వందల ఏళ్లు విదేశీశక్తుల దాడికి గురైందని ప్రముఖ రచయిత, రాజకీయ విశ్లేషకుడు శంతన్ గుప్తా పేర్కొన్నారు. శనివారం ప్రజ్ఞాభారతి జిల్లాశాఖ ఆధ్వర్యంలో కరీంనగర్‌లో నిర్వహించిన 'ప్రగతి పథంలో భారతదేశం' (ఎమర్జింగ్ భారత్) కార్యక్రమానికి హాజరై ప్రసంగించారు. స్వాతంత్ర్యం అనంతరం ఎప్పుడూ లేనంతగా గత పదేళ్లలో మనదేశం ప్రగతిపథంలో పయనిస్తున్నదని, ప్రపంచంలోనే ఐదవ ఆర్థిక శక్తిగా ఎదిగి విశ్వ గురువు స్థాయికి చేరుకుందన్నారు. 370 ఆర్టికల్ రద్దు ద్వారా కశ్మీర్‌లో శాంతియుత వాతావరణం నెలకొల్పడం, ఇస్లాం మతంలోని ట్రిపుల్ తలాక్‌ను రద్దు చేయడం మనదేశ సుదృఢ నాయకత్వానికి నిదర్శనంగా నిలుస్తాయన్నారు. ప్రపంచ యోగా దినోత్సవాన్ని అన్ని దేశాలు నిర్వహించేలా చర్యలు తీసుకుందని వివరించారు. ప్రజ్ఞాభారతి చైర్మన్ డా.ఎల్.రాజభాస్కర్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి డి. నిరంజనాచారి, పూర్వ కార్యదర్శి ఎలగందుల సత్యనారాయణ, జిల్లా ప్రధానకార్యదర్శి మందల నగేశ్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు గాజుల రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

రోహిత్ కేసును పునర్విచారించాలి

కరీంనగర్‌కల్చరల్: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో ఎనిమిదేళ్ల క్రితం కులవివక్షకు గురై సంస్థాగత హత్యచేయబడిన రోహిత్ వేముల కేసును పునర్విచారించాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠరెడ్డి డిమాండ్ చేశారు. శనివారం కరీంనగర్‌లోని బద్దం ఎల్లారెడ్డిభవన్‌లో ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ప్లకార్డులతో నిరసన వ్యక్తం చేశారు. రోహిత్ ఎస్సీ కాదంటూ పోలీసులు హైకోర్టుకు నివేదిక సమర్పించి, కేసును మూసివేయడాన్ని ఏఐఎస్ఎఫ్ పక్షాన ఖండిస్తున్నామని అన్నారు. పోలీసులు కేవలం రోహిత్ కులంపై మాత్రమే విచారించారే తప్ప యూనివర్సిటీలో జరుగుతున్న కులవివక్షపై విచారణ చేయలేదని తెలిపారు. బీజేపీ, ఏబీవీపీ నాయకులు డిమాండ్ చేసిన దానికి అనుకూలంగా నివేదిక ఇచ్చారని ఆరోపించారు. ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మచ్చ రమేశ్, జేరిపోతుల జనార్దన్, కౌన్సిల్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

సంజయ్ ఓ పొలిటికల్ టూరిస్ట్

కరీంనగర్ కార్పొరేషన్: ఎంపీ బండి సంజయ్ ఓ పొలిటికల్ టూరిస్టు అని కాంగ్రెస్ లోకసభ అభ్యర్థి వెలిచాల రాజేందర్‌రావు విమర్శించారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ప్రజలు ఓటేస్తే గెలిచి ఐదేళ్ల పాటు అందుబాటులో లేకుండా పోయారన్నారు. ఎంపీగా ఉన్న ఐదేళ్లలో 650 స్థానిక సంస్థల సర్వసభ్య సమావేశాలు జరిగితే ఒక్క సమావేశానికి కూడా సంజయ్ హాజరు కాలేదన్నారు. తాను స్థానికుడిని కాదనడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. తనది కరీంనగర్ అని, ఇది తన అడ్డా అని స్పష్టం చేశారు. యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శిగా, సింగిల్ విండో డైరెక్టర్ గా కాంగ్రెస్ పార్టీ నుంచి ప్రాతినిధ్యం వహించానని, 2009లో చొప్పదండి ఇండిపెండెంట్ అభ్యర్థిగా పోటీ చేసి 30 వేల పైచిలుకు ఓట్లు సాధించినట్లు తెలిపారు. 2009లో పార్లమెంట్ అభ్యర్థిగా బరిలో దిగి 1,76,000 ఓట్లు సాధించినట్టు గుర్తు చేశారు.

ఎమ్మెల్యే నివాసంలో కార్పొరేటర్లు, ముఖ్య నాయకులతో సమావేశం



మాట్లాడుతున్న గంగుల, హాజరైన కార్పొరేటర్లు

కరీంనగర్: ఎన్నికలకు సమయం దగ్గరపడుతున్నా కొద్ది బీఆర్ఎస్ నాయకులు మరింత అప్రమత్తమవుతున్నారు. బీఆర్ఎస్ అభ్యర్థి వినోద్ కుమార్ గెలుపే ధ్యేయంగా అలర్ట్ చేస్తున్నారు. తాజాగా శనివారం కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ నివాసంలో కార్పొరేటర్లు, ముఖ్య నాయకులతో సమావేశం ఏర్పాటు చేశారు. సమావేశానికి ఎమ్మెల్యే గంగుల, ఎమ్మెల్సీ భానుప్రసాద్‌రావు, మేయర్ సునీల్‌రావు, బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్ ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. పార్టీ బలోపేతం కోసం కష్టపడుతున్న వారిని గుర్తించే బాధ్యత మన అందరిపై ఉందన్నారు. సరైన సమయంలో వారికి అండగా నిలుస్తామని హామీ ఇచ్చారు.

ఇంటింటా ప్రచారం



ఇంటింటా ప్రచారం చేస్తున్న నాయకులు

కరీంనగర్: నగరంలోని మార్కండేయనగర్‌లో శనివారం 15వ డివిజన్ పార్టీ సీనియర్ ఉద్యమకారుడు, యువజన విభాగం ప్రతినిధి వొడ్నాల రాజు ఆధ్వర్యంలో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. కారు గుర్తుపై ఓటు వేసి వినోద్‌కుమార్‌ను గెలిపించాలని కోరారు. సీనియర్ మహిళా ప్రతినిధులు విజయ, రాజేశ్వరి, లావణ్య, పుష్పలత, అనిత, నవ్య, అఖిల, శివాజీ, కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

లోఓల్టేజీ నియంత్రణకు డీటీఆర్ ఏర్పాటు



కొత్త డీటీఆర్ ఏర్పాటు చేస్తున్న సిబ్బంది

కరీంనగర్‌రూరల్: కరీంనగర్ మండలం బొమ్మకల్ గ్రామపంచాయతీ పరిధిలోని శివాజీనగర్‌లో లోఓల్టేజీ నియంత్రణకు శనివారం లైన్‌మెన్ ప్రకాశ్ ఆధ్వర్యంలో విద్యుత్ సిబ్బంది కొత్త డీటీఆర్‌ను ఏర్పాటు చేశారు. కొన్ని నెలల నుంచి శివాజీనగర్‌లో నెలకొన్న విద్యుత్ లోవోల్టేజీ సమస్యతో కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. లోవోల్టేజీ సమస్య పరిష్కరించాలనే కాలనీవాసుల విజ్ఞప్తి మేరకు అధికారులు కొత్త డీటీఆర్‌ను యుద్ధప్రాతిపదికన బిగించారు. కొత్త డీటీఆర్‌ను ఏర్పాటు చేసి విద్యుత్‌సమస్యను పరిష్కరించిన లైన్‌మెన్ ప్రకాశ్, ఏఈ తిరుపతి, ఏడీఈ రాజులకు కాలనీవాసులు కృతజ్ఞతలు తెలిపారు.

నేతన్నల బాధలు సీఎంకు కనిపించలేదా..?



మాట్లాడుతున్న వాసాల రమేశ్

కరీంనగర్‌టౌన్: సిరిసిల్లకు వచ్చిన సీఎంకు నేతన్నల బాధలు కనిపించలేదా అని బీజేపీ సీనియర్ నాయకుడు, మాజీ ఎంపీపీ వాసాల రమేశ్ ప్రశ్నించారు. కనీసం ఆత్మహత్య చేసుకున్న నేతన్న కుటుంబాన్ని పరామర్శించలేని పరిస్థితుల్లో ఉన్నారని, ఆయనకు రాజకీయాలు, ఓట్ల మీద ఉన్న శ్రద్ధ సమస్యల పరిష్కారంపై, 6 గ్యారంటీల అమలుపై లేదని విమర్శించారు. శనివారం కరీంనగర్ పార్లమెంట్ కార్యాలయంలో మాట్లాడారు. దేశంలో వస్త్ర పరిశ్రమకు పెట్టింది పేరు సిరిసిల్ల అని, ఎన్నికల ప్రచారంలో భాగంగా సిరిసిల్లకు వచ్చిన సీఎం రేవంత్ రెడ్డి చేనేత కార్మికుల కష్టాలపై ఎలాంటి ప్రకటన చేయకపోవడం విచారకరమన్నారు. ప్రభుత్వం చేనేత పరిశ్రమకు దాదాపు రూ.300 కోట్ల బకాయిలు చెల్లించాలని, బకాయిల చెల్లింపుపై ఎంపీ సంజయ్ దీక్ష చేపడతారని తెలిసి హడావిడిగా రూ.50 కోట్లు విడుదల చేసి బతుకమ్మ చీరల వ్యాపారులకు రూ.25 కోట్లు, అనుబంధ ప్రాసెసింగ్ వారికి రూ.25 కోట్లు చెల్లించారన్నారు. మిగిలిన బకాయిలను తక్షణమే విడుదల చేయాలన్నారు. ఆరు గ్యారంటీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందన్నారు. సమావేశంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తాళ్లపల్లి శ్రీనివాస్‌గౌడ్, మీడియా కన్వీనర్ కటకం లోకేశ్, జిల్లా అధికార ప్రతినిధి, సెన్సార్ బోర్డు సభ్యుడు కళ్యాణ్ చంద్ర తదితరులు పాల్గొన్నారు.

నేడు ప్రజాస్వామ్య పరిరక్షణ సభ



కరపత్రం విడుదల చేస్తున్న నాయకులు

విద్యానగర్: పౌర సంఘాల ఐక్య వేదిక జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం కరీంనగర్ రెవెన్యూ గార్డెన్స్‌లో నిర్వహించే ప్రజాస్వామ్య పరిరక్షణ సభ కరపత్రాలను శనివారం కన్వీనర్ కొరివి వేణుగోపాల్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అన్నిరంగాల ప్రజలను అభివృద్ధి పరిచే బాధ్యత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఉందని, ఈ అంశాలపై జరిగే చర్చకు ప్రజాస్వామ్య పరిరక్షణ రాష్ట్ర అధ్యక్షుడు జస్టిస్ చంద్రకుమార్, సోషల్ డెమొక్రటిక్ ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు ఆకునూరి మురళి, రిటైర్డ్ ప్రొఫెసర్ కె.వెంకటనారాయణ ముఖ్య అతిథులుగా హాజరవుతారని పేర్కొన్నారు. అలాగే ప్రజాస్వామ్య పరిరక్షణ సమితి, తెలంగాణ రైతు సంఘం, తెలంగాణ గిరిజన సంఘం, ప్రజామిత్ర ప్రొగ్రెసివ్ డెమొక్రటిక్ ఫ్రంట్, దళిత లిబరేషన్ ఫ్రంట్, సీఐటీయూ, కేవీపీఎస్, ఎస్ఎఫ్ఐ తదితర సంఘాలు పాల్గొంటాయని తెలిపారు. కార్యక్రమంలో కో కన్వీనర్లు గుడికందుల సత్యం, జి. భీమాసాహెబ్, మార్వాడి సుదర్శన్, అజీజ్ అహ్మద్, డేవిడ్ రాజు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ఏకాదశి ఉత్సవం

కరీంనగర్‌కల్చరల్: తిరుమల్‌నగర్‌లోని మయూరగిరి పీఠం శ్రీనిలయంలో చైత్ర బహుళ ఏకాదశి ఉత్సవం శనివారం వైభవంగా జరిగింది. ప్రముఖ జ్యోతిష్య వాస్తు ఆగమశాస్త్ర పండితులు నమిలకొండరమణాచారి ఆధ్వర్యంలో నారాయణమూర్తికి ఫల పంచామృత అభిషేకం, అష్టాక్షరి మూలమంత్ర సహిత లక్ష్మీనారాయణ హోమం, శ్రీ సూక్తం సంపుటీకరణ, విష్ణు సహస్రనామ పారాయణములు భక్తులచేయ హనుమాన్ చాలీసా పారాయణాలు జరిపారు. కార్యక్రమంలో రామకృష్ణమాచార్యులు, వినయ్ కుమార్ ఆచార్యులు, గీతాచార్యులు, రమేశ్, తదితరులు పాల్గొన్నారు.